# "ముద్దియ్యవా"..... ఏ సంధి?

"ఏవేంవ్, ఓసారిలా వచ్చి తగలడతావ్?"

"ఇప్పుడు తగలడలేను, ఇక్కడ వంట తగలెడుతున్నా! అనకది మాడి తగలడిందని కేకలేస్తే - నేను నోర్మూసుకుని తగలడలేను!"

"సరే! నీ చమక్కులు తగలెట్టి, ఓసారిలా తొందరగా రామ్మా" రామనాధంకి కోపం వస్తే భార్యతో మాట్లాడే తీరే అది. అందుకామె ప్రతివచనం తీరే అది. అది వాళ్ళకో నరదా, చేసినవాళ్ళకు, విన్నవాళ్ళకూ అదేదో దెబ్బలాటలాగా అనిపిస్తుంది.

"ఆ( ..... చెప్పండయ్యగారూ!"

"ఆ కుర్రకుంక.... నీ తమ్ముడు వెధవ.... శేఖరు గాడు లేడూ... వాడు మన కిరణ్‌గాణ్ణి పాడుచేసేస్తున్నాడు. వీడేమో నన్నడక్కండా 'చుంబక వియోగం' అంటే ఏంటని వాణ్ణడిగాట్ట్ో సారి. 'చంబకం' అంటే ముద్దు, 'వియోగం' అంటే ఎడబాటూ అంటూ 'చంబక వియోగం' అంటే 'భగ్న ప్రేమ' అని సెల విచ్చాట్ట నీ తమ్ముడు!"

"మరేం? చక్కగా చెప్పాడు. అమ్మో అమ్మో.... వాడికంత తెలుగొచ్చేసిందన్న మాట!"

"నాశ్రాద్ధం... నీ పిండాకూడూను... 'చంబకం' అంటే 'ముద్దను' కుంటున్నావా?"

"ఏవెూ! నాకా ముద్దూ, ముచ్చటగురించీ ఏం తెలుస్తుంది?" అని ఓరగా చూసింది.



"సరసాలు చాల్లే, 'చుంబకం' అంటే 'అయస్కాంతం' 'చుంబక వియోగం' అంటే అయస్కాంతతత్వం కోల్పోవడం"

"ఇప్పుడు నోర్మూసుకుని విను, వాడిని తెలుగులో పెట్టొద్దూ. ఏ ఎంపీసీ లోనో సైన్సు లోనో పెట్టి ఏమేస్ట్రో చెయ్యమంటే... ముద్ద ఫ్రీగా దొరుకుతుందని మీ నాన్న మన మీదకి నెట్టాడు తెలుగు పోస్టులు ఖాళీ అవుతున్నాయని"

"ఆ మాటనకండి. మీనాన్న మీకలానే చేసి మిమ్మల్ని నాకంట కట్టలేదూ?"

"ఇదిగో వరాచికాలు కట్టిపెట్టి విషయంలోకి రానిస్తావా! ఇప్పుడు ముద్దియ్యావా?' ఏసంధి? అని - ఈ వెధవని మనమీదికి నెట్టాడు. వాడికిష్టం లేకపోతే చదువు మానేసి పొమ్మను".

"అబ్బ! ఎందుకండీ ఆ రుసరుసలూ... ఆసంధి పేరుచెప్పి పంపెస్తే పోలా?"

"చెప్పాను. మళ్ళా తిప్పి పంపాడు కదా! నేచెప్పింది కాదంటాడు".

"'ముద్ద+ఇయ్యవా?' అకార సంధి అని చెపితే..... ముద్దు+ఇయ్యవా? విడదీస్తే ఉకార సంధి కాదా? పరీక్షలో ఇలా రాస్తే మార్కులు పడవా? అని వీడిచేత కవురూ! ఈ వెధవ, ఆ వెధవనే అడుగుతాడాయె!"

"మరి మీరే వెధవని అడగమంటారు?"

"అంటే నీ ఉద్దేశ్యం?"

"పోనీ.... ఇంతకీ విషయం లోనికి రండి!"

"వాణ్ణి పిలిచి వాడికి చదవాలనుందో, వెళ్ళిపోవానుందో కనుక్కో, వాడిలాటి సంధి విడదీయుడు కార్యక్రమంలోకొచ్చాడంటే.... ఏ పిల్ల సందిట్లోనో పడబోతున్నాడేమోనని నా అనుమానం!"

"మీరు మరీనూ... మీలాగే అందరూ అంత చురుగ్గా ఉండరు...."

"ఇదిగో.... మళ్ళా!"

"పోనీలెండి!ఒరే నాన్నా శేకరూ....."

"ఏంటక్కా?"

"మీ బావనెందుకురా అల్లరిపెడతావ్? ఆ సంధిపేరు...." అంటుండగానే....

"అదికాదక్కా! ఇందాక వీధిలో ఓ కుంటి బిచ్చగాడు పక్కనే ఉన్న ఓ బిచ్చగత్తె భోంచేస్తుంటే.... ఆకలేసింది కాబోలు వీడికి.... వీడెండలో ఉన్నాడు అన్నం తిన్లేదు.....? ఒసే నాన్నీకు బియ్యమిత్తాను.... నాకో ముద్దియ్యరాదా?" అని అడిగాడు దానికదేమో అది రెచ్చిపోయి మీదవడిపోయి, కుంటినాకొడకా! అడిగిన వతీ ఎదవకీ ముద్దిచ్చీనానికి నానేటి 'చిల్పాచెట్టి' ననుకున్నావా?" అని మక్కెలిరగదన్నింది. వాడొహటే గోల. "నాన్నీకు అన్నం ముద్ద డిగినానే... ముద్దుకాదే.... తల్లోడు....." అని నెత్తీ నోరూ కొట్టుకుంటుంటే నాకు డౌటొచ్చింది. 'ఉకారసంధికి టెస్ట్‌లో ఉదా హరణ రాయమన్నారనుకో..... 'ముద్దియ్యవా? రాస్తే మార్కులేస్తారా? వెయ్యరా? అని డౌటొచ్చి అడిగితే బావగారు మండిపోతున్నారు." అన్నాడు.

విరగబడి నవ్విందామె. "ఓ కప్పుడు కాఫీ పోస్తే బావగారు చల్లారతార్లే... నువ్వెళ్ళు." అంది.

వాళ్ళెళ్ళాక, "అవునండీ! ఇంతకీ "ముద్దియ్యవా?" ఏసంధి అంటారూ?" అంది గమ్మత్తుగా భర్త కళ్ళలోకి చూస్తూ... రామనాథం తెలివిగా "ఆకలేసినపుడు 'ముద్దియ్యవా' అని అడిగితే అకారసంధీ...." అంటుండగానే.....

"మరి ఏ ఆకలో పిల్లాడికెలా తెలుస్తుందండీ.... మీకూ నాకూ అయితే తెలుస్తుంది గానీ....." అని అక్కణ్ణుంచి తుర్రుమంది, భర్త పోవులా చిట పటలాడతాడని.